క్లుప్తంగా

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి స్పందన ఫిర్యాదులు స్వీకరించనున్న ట్లు పేర్కొన్నారు. నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయ కార్యాలయాల్లో మధ్యాహ్నం 3 –5 గంటల మధ్యలో ప్రజలు వినతులు అందచేయవచ్చన్నారు. ఇక ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్‌సెంటర్ ఫోన్: 08572232745, వాట్సాప్–9849907885 నెంబర్లకు సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ కిరణ్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన పేర్కొన్నారు.

నేడు బండపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

గుడిపాల: మండలంలోని బండపల్లె గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గుడిపాల పీహెచ్‌సీ వైద్యాధికారి కఠారి కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటలకు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో కార్యక్రమం జరుగుతుందన్నారు. గర్భిణులు, బీపీ, షుగర్, జ్వరంతో బాధపడుతున్న వారు వైద్య సేవలను పొందవచ్చని తెలిపారు. ఉచితంగా మందులు ఇస్తామన్నారు.

మేలో గంగమ్మ జాతర

యాదమరి: మండల కేంద్రమైన యాదమరిలో మే 2,3,4వ తేదీల్లో తిరుపతి గంగమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏప్రిల్ 25న చాటింపు ఉంటుందన్నారు. అలాగే పెరుమాళ్లపల్లెలో మే 3న చాటింపు, 8,9,10 వ తేదీల్లో జాతర నిర్వహించనున్నారు.

కరెంటు బిల్లుల ద్వారా రూ.5 లక్షలు

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారుల సౌకర్యం కోసం ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం కల్పించారు. చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్ పరిధిలోని ఈఆర్వో, ఏఈ కార్యాలయాల్లో వినియోగదారులు బిల్లులు చెల్లించారు. మొత్తం 1300 బిల్లులు చెల్లించగా తద్వారా ఆ శాఖకు రూ.5 లక్షల వరకు ఆదాయం వచ్చిందని ఈఈలు పద్మనాభపిళ్లై హరి తెలిపారు.

దుర్గాలమ్మ ఆలయంలో చోరీ


దుండగులు ధ్వంసం చేసిన గేటు

గుడిపాల: మండలంలోని బొమ్మ సముద్రంలో ఉన్న దుర్గాలమ్మ ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయ గేటును పగులగొట్టి లోపల ఉన్న హుండీని అపహరించారు. ఆదివారం సాయంత్రం అమ్మవారికి పూజ చేయడానికి వచ్చిన భక్తురాలు గుర్తించి గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

శివాలయంలో నేడు రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలో ప్రముఖ శైవ క్షేత్రం మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజ, ఆలయ ధర్మకర్త విజయకుమార్ తెలిపారు. ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వర స్వామి, కామాక్షమ్మ వారికి అభిషేకాలు, పూజలు చేపట్టనున్నట్లు చెప్పారు. అనంతరం ఉదయం రాహు కాల సమయం 7.30 గంటల నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు నిర్వహించన్నుట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దోష నివారణ చేసుకోవాలని కోరారు.

29 నుంచి కోదండరాముని బ్రహ్మోత్సవాలు

చిత్తూరు రూరల్: నగరంలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 29తో ప్రారంభమై, ఏప్రిల్ 9వతేదీతో ముగుస్తాయి. ప్రతిరోజు ఉదయం, రాత్రి వివిధ రూపాల్లో వాహనాల్లో స్వామి వారు విహరించనున్నారు. 29న విష్వక్సేన తిరుమంజనం, ఉత్సవం, 30న శ్రీరామనవమి, సింహవాహనం, 31న హంస, సూర్యప్రభ వాహనంపై స్వామి వారు ఊరేగనున్నారు. ఏప్రిల్ 1న గరుడ వాహనం, హనుమంత వాహనం, 2న శేషవాహనం, చంద్ర ప్రభవాహనం, 3న పల్లకి ఉత్సవం, మోహిని అలంకారం, యాళి వాహనం, 4న వేణుగోపాల అలంకారం, వసంతోత్సవం, గజవాహనం, 5న రథోత్సవం, తోట ఉత్సవం, 6న పల్లకిలో వెన్నకృష్ణుడి అలంకారం, గుర్రపు వాహనం, 7న భిక్షాటన, పుణ్యకోటి విమానం, 8 మహా తిరుమంజనం, సీతారాముల కల్యాణం, పుష్పపల్లకి సేవ, 9న ధ్వజావరోహణం, వడాయత్తు ఉత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

పల్లె మురిసేలా.. ప్రగతి మెరిసేలా

- 'గడప గడప'తో గ్రామాల అభివృద్ధి
- ప్రతి గ్రామ సచివాలయానికి రూ.20 లక్షల నిధులు
- పల్లెల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ, తాగు నీరు, కల్వర్టు సమస్యల పరిష్కారం
- ప్రతిపక్షాల ఆరోపణలకు అభివృద్ధి పనులతో సమాధానం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


ఈచనేరిలో పూర్తయిన సిమెంటు రోడ్డు

తవణంపల్లె: రాష్ట్ర ప్రభుత్వం ''గడప గడపకు మన ప్రభుత్వం'' కార్యక్రమం ద్వారా గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు గ్రామాలు అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఇంటింటికీ వెళ్లి (గడప గడపకు) ప్రజలతో మమేకమై, వారికి అందుతున్న సంక్షేమ పథకాల గురించి తెలుసుకోవడమే కాకుండా సమస్యలపై ఆరా తీయాలని సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాల విషయంలో అర్హులై ఉండి పథకాలు అందని వారికి పథకాలు అందేలా చూడాలని, అలాగే గ్రామాల్లో అభివృద్ధి పనులు, ఇతర సమస్యలపై ప్రజలతో నేరుగా మాట్లాడి తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు ప్రభుత్వ అధికారులతో కలిసి గడప గడపకు తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు.

మండలం	మంజూరైన పనులు (పంచాయతీ రాజ్/ఆర్‌డబ్ల్యూఎస్)	మంజూరైన నిధులు(కోట్లలో)
తవణంపల్లె	43	రూ.1.53 కోట్లు
బంగారుపాళ్యం	59	రూ.2.01 కోట్లు
యాదమరి	34	రూ.1.34 కోట్లు
ఐరాల	110	రూ.2.04 కోట్లు
పూతలపట్టు	78	రూ.1.92 కోట్లు

నియోజకవర్గానికి రూ.9.19 కోట్లు మంజూరు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పూతలపట్టు నియోజకవర్గంలోని తవణంపల్లె, ఐరాల, పూతలపట్టు, యాదమరి, బంగారుపాళ్యం మండలాల్లో 324 పనులకు రూ.9.19 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ పనులు, తాగునీటి సరఫరా కోసం పైపులైన్లు, ప్రహరీగోడ నిర్మాణాలు, కల్వర్టు పనులు వివిధ దశల్లో జరుగుతున్నాయి. ఇందులో 70 పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

డ్రైనేజీ పనులకు ప్రాధాన్యత



పలు గ్రామాల్లో డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బంది పడేవారు. గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేతో కలిసి సమస్యలను గుర్తించాం. డ్రైనేజీ సమస్యకు ప్రాధాన్యత ఇచ్చాం. అలాగే తాగునీటి సరఫరా కోసం పైపులైన్ పనులు జరుగుతున్నాయి. నియోజకవర్గంలో 122 పనులకు ఇప్పటి వరకు 23 పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

– శ్రీనివాసులు, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్

చురుగ్గా సిమెంటు రోడ్డు పనులు

రోడ్డు లేని గ్రామం ఉండకూడని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా నియోజకవర్గంలో రోడ్లు అవసరమైన గ్రామాలను గుర్తించాం. మరికొన్ని చోట్ల మరమ్మతులు చేయాలని నిర్ణయించాం. మొత్తం 202 పనులు మంజూరయ్యాయి. ఇందులో 47 పూర్తవగా మిగిలిన చోట్ల శరవేగంగా పనులు జరుగుతున్నాయి.

– మహేష్‌కుమార్, డీఈఈ, పంచాయతీ రాజ్

అభివృద్ధి పనులు వేగవంతం



గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈచనేరి పంచాయతీలో సమస్యలను గుర్తించాం. పలు గ్రామాల్లో సిమెంటు రోడ్లు నిర్మించాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి. ప్రాధాన్యతా క్రమంలో పనులు పూర్తి చేస్తున్నాం. బిల్లుల చెల్లింపులో కొంత జాప్యం జరుగుతున్నా పనులు మాత్రం ఆపడం లేదు.

– ఉమామహేశ్వర రెడ్డి, సర్పంచ్, ఈచనేరి

డ్రైనేజీ సమస్య తీరింది



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్. బాబు మా గ్రామానికి వచ్చారు. గ్రామస్తులంతా డ్రైనేజీ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లాం. వెంటనే స్పందించిన ఆయన నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం మా గ్రామంలో డ్రైనేజీ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సీఎం జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయంతో మా గ్రామం బాగుపడింది.

– దేవేంద్ర, నాగంవాండ్లపూరు, ఐరాల

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పర్యటించాం. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నాం. వాటిని ఆయా శాఖల అధికారులకు తెలియజేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రతి సచివాలయానికి సీఎం రూ.20 లక్షల నిధులు కేటాయించారు. వాటితో యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే కొన్ని పూర్తయ్యాయి. మిగిలిన పనులను వేగవంతంగా పూర్త చేసేందుకు కృషి చేస్తున్నాం.

– ఎంఎస్.బాబు, ఎమ్మెల్యే, పూతలపట్టు


అరగొండ పంచాయతీ ప్రైమాఘంలో..


ఐరాల మండలం నాగంవాండ్లపూరులో డ్రైనేజీ నిర్మాణం పనులు


ఎడమలవారిపల్లెలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్


గోవిందరెడ్డిపల్లెలో నిర్మించిన సిమెంటు రోడ్డు

భగవంతుని ఆశీస్సులతోనే చిత్తూరు సుభిక్షం

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


విరాళ దాతను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: భగవంతుని ఆశీస్సులతోనే చిత్తూరు సుభిక్షంగా ఉందని, సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు నగరం బీజెడ్‌స్కూల్ ఆవరణలో ఆదివారం శ్రీకోదండరామస్వామి ఆలయ రథ నిర్మాణానికి సహకరించిన దాతలకు అభినంద సభ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. పాలకమండలి సభ్యుల సమష్టి కృషితో దాతల సహకారంతో రూ. 25 లక్షలు విరాళం సేకరించి కోదండరామస్వామికి రథం చేయించారన్నారు. ఈ రథం నిర్మాణంతో ఆలయానికి పూర్వవైభవాన్ని తీసుకొచ్చారని కొనియాడారు. అందరూ సమన్వయంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. దేవుడి ఆశీస్సులతోనే నాలుగేళ్లలో చిత్తూరుకు పుష్కలంగా నీరందుతోందన్నారు. ఆలయ చైర్మన్ సకల వెంకటేష్‌గుప్తా, అర్చకులు వేణుగోపాల్, సభ్యులు రాజా, హేమాద్రి, మాధవి, దుర్గాదేవి, ఈశ్వరి, రమేష్‌లు దాతలను సత్కరించారు. కోనేరు నిర్మాణానికి సహాయ సహకారాలు అందించాలని ఆలయ అర్చకులు ఎమ్మెల్యేను కోరారు.

యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం


సోమశేఖర్‌నాయుడు, జీవీ రమణ

చిత్తూరు కలెక్టరేట్ : యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. స్థానికంగా కట్టమంచిలో ఉన్న ఓ ప్రైవేట్ కళ్యాణమండపంలో ఆదివారం ఆ సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశాలను నిర్వహించారు. అనంతరం చిత్తూరు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

చిత్తూరు జిల్లా నూతన కమిటీ ఇలా.

ఎన్నికల అధికారి యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, ఎన్నికల పరిశీలకులు యుటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాస రావు, రాష్ట్ర కార్యదర్శి టి రఘుపతి రెడ్డి ఈ ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎం.సోమశేఖర్ నాయుడు (ఐరాల మండలం), ప్రధాన కార్యదర్శిగా జీవి రమణ (చిత్తూరు), గౌరవ అధ్యక్షుడిగా సుధాకర్ రెడ్డి (తవణంపల్లె) సహాధ్యక్షులుగా మునిరత్నం (నగరి), రెహానా బేగం (యాదమరి), కోశాధికారి గా ఓ.ప్రసన్న కుమార్ (గంగవరం), కార్యదర్శులుగా కృష్ణమూర్తి (వి.కోట), ఇ.జగన్మోహన్ రెడ్డి (చౌడేపల్లి), కె.రెడ్డెప్ప నాయుడు (పూతలపట్టు), గాలి సురేష్ (కుప్పం), దక్షిణామూర్తి (చిత్తూరు) ఓ.రూప (కార్వేటినగరం) ఎన్నికయ్యారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్లదే బాధ్యత


ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై ఉందని ఎంపీడీఓ గౌరి అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాల విషయంలో లబ్ధిదారులతో మాట్లాడి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. చాలా వరకు లబ్ధిదారులు సగంలోనే పనులు నిలిపివేయడం గమనించామని తెలిపారు. వారి సమస్యలను తెలుసుకుని పూర్తి చేయించాల్సిన బాధ్యత అసిస్టెంట్లపై ఉందన్నారు. కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని.. అలాంటి ధోరణి విడనాడాలని సూచించారు. మండలంలో ఇప్పటి వరకు 833 ఇళ్లు పూర్తయినట్లు తెలిపారు. అనంతరం సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. సచివాలయంలో ఉన్న ప్రతి శాఖ బాధ్యతగా పనిచేస్తేనే పనులు పూర్తవుతాయని తెలిపారు. హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

టౌన్‌బ్యాంకు అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు అగ్రికల్చర్: చిత్తూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక టౌన్ బ్యాంకు కార్యాలయ సమావేశ భవనంలో పాలకవర్గం చైర్మన్ రాంగణేష్ అధ్యక్షతన మహాజన సభ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రెండేళ్లుగా బ్యాంకు అంచలంచెలుగా అభివృద్ధి చెందుతోందన్నారు. బ్యాంకులో డిపాజిట్లు పెరుగుతున్నా యని తెలిపారు. విరివిగా రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఎన్ఈఎఫ్‌టీ, ఆర్టీజీ ఎస్ సదుపాయం కూడా అందుబాటులో ఉందన్నా రు. ఖాతాదారులకు ఏటీఎం సౌకర్యం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి


సంఘం సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

బంగారుపాళెం: సేవా కార్యక్రమాలకు సంఘాలు ముందుండాలని విశ్రాంత ప్రిన్సిపల్ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మండల కరణం సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు జగదీశ్వర పిళ్లై అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘాన్ని బలోపేతం చేసుకుంటూ సేవా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. సంఘం బలోపేతానికి సభ్యులు కృషి చేయాలని కోరారు. భవిష్యత్‌లో చేపట్టనున్న కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కరణం సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రవీంద్రప్రసాద్, కోశాధికారి భాస్కర్ పిళ్లై, గౌరవ సభ్యులు షణ్ముగంపిళ్లై, దశరథపిళ్లై, సిద్ధలింగపిళ్లై, తులసీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత


ప్రసంగిస్తున్న శ్రీనివాస్‌రావు

తవణంపల్లె: ధ్యానంతో మానసిక ప్రశాంతత పొందవచ్చని హైదరాబాద్ సీనియర్ పిరమిడ్ మాస్టర్ బండి శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని సిద్ధంపల్లె సమీపంలోని శ్రీవిఘ్నేశ్వర మహా పిరమిడ్ శక్తి క్షేత్రంలో ఆత్మజ్ఞాన సదస్సు నిర్వహించారు. సంతోషం కంటే ఆనందం గొప్పదని.. సంతోషం మనస్సుకు సంబంధించినది అయితే ఆనందం ఆత్మకు సంబంధించినదని పేర్కొన్నారు. ప్రకృతికి సంబంధించిన ఏ పనినైనా చేయాలి కానీ విరుద్ధంగా ఏ పని చేయరాదన్నారు. ప్రొద్దుటూరుకు చెందిన పిరమిడ్ మాస్టర్ సుజనా ధ్యానం వల్ల కలిగే లాభాలను వివరించారు. నిరంతరం ధ్యాన సాధన ద్వారా అతీతమైన శక్తులను పొందవచ్చని అన్నారు. అనుకున్నది సాధించాలన్నా.. శాశ్వతమైన ఆనందాన్ని పొందాలంటే ప్రతి ఒక్కరూ శాఖాహారం భుజించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా పిరమిడ్ ఆధ్యాత్మిక సొసైటీ, గ్లోబల్ స్పిరిచువల్ ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ బి.గోపాలకృష్ణ మూర్తి, కన్వీనర్ రాధిక వక్తలను సత్కరించారు.

వెంగంపల్లె హైస్కూల్‌లో పారిశుద్ధ్య పనులు


చెత్తను తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

తవణంపల్లె: మండలంలోని వెంగంపల్లె హైస్కూల్‌లో అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఆదివారం పారిశుద్ధ్య పనులు చేశారు. పాఠశాల ఆవరణలోని ముళ్ల చెట్లు, చెత్తను తొలగించారు. మొక్కలు నాటి నీరు పోశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో అపోలో నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు శోభారాణి, బేబీఉష, ఉపాధ్యాయులు, సర్పంచ్ రాజేశ్వరమ్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక గీతాలాపన


భక్తి పాటలను ఆలపిస్తున్న గాయకులు


భక్తులతో నిండిపోయిన క్యూలు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి ఆస్థాన మండపంలో తిరుపతికి చెందిన సంస్కృతి సంస్థ గాయకులు భక్తిశ్రద్ధలతో భక్తి పాటలను ఆలపించారు. ఆదివారం నిర్వహించిన ధర్మపథం కార్యక్రమంలో సంస్కృతి సంస్థ గాయకులు 108 ఆధ్యాత్మిక గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమానికి ఆలయ ఈఓ వెంకటేశు హాజరై కళాకారులను సన్మానించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కళాకారులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన కాణిపాకం

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది ఆదివారం సెలవు రోజు కావడంతో ఉదయం నుంచి స్వామిని దర్శించుకోవడానికి భక్తులు తరలి వచ్చారు. దీంతో రూ.150, రూ.100, ఉచిత క్యూలు, స్వామివారి కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, తగు చర్యలు తీసుకొని భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.